Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 132 | Friday 25.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 132 | శుక్రవారం 25. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

## సింధు జలాల ఒప్పందాన్ని...

# భారత్ రద్దు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అమిత్ షా, జైశంకర్ కీలక భేటీ

పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాలు తీవ్ర ఉద్రిక్తం

పాక్ పౌరులకు వీసాలు నిలిపివేత - ప్రతిగా భారత విమానాలకు పాక్ గగనతలం మూసివేత

రాష్ట్రపతి ముర్ముతో హెూంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ

G20 దేశాల రాయబారులతో భారత విదేశాంగ శాఖ సంప్రదింపులు

న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కేంద్ర మంత్రులు అమిత్ షా, జైశంకర్ కలిశారు. పహల్గాం ఉగ్రదాడి, భారత్ చర్యల నేపథ్యంలో రాష్ట్రపతితో భేటీ అయిన కేంద్ర మంత్రులు దేశభద్రత, పాక్ దౌత్యపరమైన చర్యలపై కీలక చర్చలు జరిపారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడి ఘటన భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలను తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ దాడిలో 26 మంది అమాయక భారతీయులను ఉగ్రవాదులు బలిగొన్న ఘటనపై భారత ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతిస్పందనగా పాకిస్థాన్‌తో కీలకమైన సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు బుధవారం ప్రకటించిన కేంద్రం, పాకిస్థాన్ జాతీయులకు అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు గురువారం వెల్లడించింది. భారత్ తీసుకున్న మిగతా 2 లో



## ఈ సస్పెన్షన్ తాత్కాలికమే...

# మళ్లీ వస్తా

### : దువ్వాడ శ్రీనివాస్

క్రమశిక్షణ పరమైన కారణాలతో దువ్వాడపై సస్పెన్షన్ వేటు

ఇటీవలే సస్పెండ్ చేసిన వైసీపీ హైకమాండ్

పార్టీ కోసం చాలా కష్టపడి పనిచేశానన్న దువ్వాడ

రాజకీయ క్రీడలో బలైపోయానేమో అనిపిస్తోందని వెల్లడి




అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను క్రమశిక్షణ పరమైన కారణాలతో వైసీపీ నుంచి సస్పెండ్ చేయడం తెలిసిందే. తన సస్పెన్షన్ పై దువ్వాడ శ్రీనివాస్ ఓ వీడియోలో స్పందించారు. ఈ నెల 22న వైసీపీ తనను సస్పెండ్ చేసిందని, ఆ మేరకు విడుదల చేసిన ప్రకటనపై తన అభిప్రాయం తెలియజేస్తున్నానని వెల్లడించారు. "వైసీపీ గురించి మాట్లాడుకునే ముందు జగన్ గారి గురించి మాట్లాడుకోవాలి. నాకు ఈ స్థాయిని, హెూదాను ఇచ్చింది జగనే... అందుకు మిగతా 2 లో

## ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం...

# ఆసన్నమైంది

ఉగ్రవాదులకు ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్

పహల్గామ్‌లో ఉగ్రవాదుల పాశవిక దాడిపై నేరుగా స్పందించిన మోదీ

బిహార్‌లో జరిగిన ఓ ప్రజా కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని

ఉగ్రవాదులను వారు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని తీవ్ర హెచ్చరికలు



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పౌరులపై జరిగిన పాశవిక ఉగ్రదాడి ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, వారి వెనుక ఉన్న శక్తులకు ఊహకు కూడా అందని రీతిలో కఠిన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బిహార్‌లో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని మోదీ పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై తొలిసారిగా నేరుగా స్పందించి, కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిని కేవలం కొందరు వ్యక్తులపై జరిగిన దాడిగా కాకుండా, యావత్ భారతదేశంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని ప్రధాని మోదీ స్పష్టం మిగతా 2 లో

## పహల్గామ్ దాడి...

# కేంద్రం వైఫల్యమే

### పహల్గామ్ లో ఉగ్రదాడి తీవ్రంగా స్పందించిన షర్మిల



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడి ఘటనపై వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యమేనని ఆమె ఆరోపించారు. ఈ దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారం మిగతా 2 లో

## అన్ని విధాల మధుసూధన్ కుటుంబాన్ని...

# అదుకుంటాం

### : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



నెల్లూరు /కావలి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పహల్గాం ఉగ్రవాద దాడి హేయమైన చర్యగా అభివర్ణిం చారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ .. ఈ ఘటనపై వ మిగతా 2 లో

## టెక్నాలజీ వినియోగంతో....

# రియల్ టైమ్‌లో సేవలు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పాలనలో ఏఐని వినియోగించినా మానవీయకోణం ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం నాడు సచివాలయంలో నిర్వహించిన ఏఐ వర్క్‌షాప్‌లో సీఎం మాట్లాడుతూ.. టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్‌లో సేవలను డెలివరీ చేయొచ్చన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఉంటుందని, త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలని చెప్పుకొచ్చారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని చెప్పారు. ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టాలన్నారు. టెక్నాలజీ అనేది మిగతా 2 లో




## బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాకే ఎన్నికలు జరపాలి..

# లేదంటే యుద్ధమే..

### : ఆర్.కృష్ణయ్య వార్నింగ్

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** బీసీ రిజర్వేషన్ల ను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్‌చేశారు. లేకపోతే యుద్ధం జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీజీలను బలిచేస్తుందని ఆరోపించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసమే 12 నెలల క్రితం జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడుతూ వచ్చాయని తెలిపారు. అలాంటిది బీసీ రిజర్వేషన్ల మిగతా 2 లో



## జగనన్న పథకాలు ప్రజలకు...

# అందడం లేదు : బుగ్గన

కూటమి ప్రభుత్వ అప్పులు, సంపద సృష్టిలో స్పష్టత కొరవడిందన్న బుగ్గన

చంద్రబాబు అనుభవం దృష్ట్యా ప్రజలు నమ్మకం ఉంచారని వ్యాఖ్య

క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని మండిపాటు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంపద సృష్టిలో వెనుకబడి, అప్పులు చేయడంలో మాత్రం ముందుందని వైసీపీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆర్థిక పరిస్థితి మెరుగుపడలేదని, అప్పులు, సంపద సృష్టి విషయంలో మిగతా 2 లో



చిత్తూరు ఎక్స్‌ప్రెస్

శుక్రవారం 25. 04. 2025

# సంపాదకీయం

## సెంట్రల్ వర్శిటీ అటవీ భూములేనా....

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద వివాదాస్పదంగా మారిన 400 ఎకరాల 'కంచ గచ్చిబౌలి' భూములపై సుప్రీం కోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ-సీఈసీ) నివేదిక కీలకంగా మారింది.పర్యావరణపరంగా అడవికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఆ భూమికి ఉన్నాయని సీఈసీ తన నివేదికలో స్పష్టం చేసింది.ఇన్నాళ్లూ ప్రభుత్వ రికార్డుల ప్రకారం, కంచ గచ్చిబౌలి భూములు 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ' భూములుగా నమోదై ఉన్నాయి.సీఈసీ ఇచ్చిన నివేదికతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగే అవకాశం కనిపిస్తోంది.'కంచ గచ్చిబౌలి' భూముల వివాదంపై ఇప్పటికే సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది.ఏప్రిల్ 16న విచారణ సందర్భంగా చెట్లను కొట్టివేసిన వంద ఎకరాల్లో పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది.అప్పటివరకు వివాదాస్పద '400 ఎకరాల కంచ గచ్చిబౌలి' భూముల్లో ఎలాంటి కార్యకలాపాలూ జరగకుండా స్టే విధించింది.సెంట్రల్ ఎంపర్డ్ కమిటీ నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఆనుకుని ఉన్న 'కంచ గచ్చిబౌలి' భూములపై వివాదం రేగిన సంగతి తెలిసిందే.సుప్రీంకోర్టులో కేసు నమోదు కావడంతో ఏప్రిల్ 3న విచారణ మొదలైంది. చెట్ల నరికివేతను ఆపాలంటూ స్టే ఇచ్చింది. అనంతరం కేంద్ర సాధికార కమిటీని నియమించింది.ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు వివాదాస్పద 400 ఎకరాలను పరిశీలించి, సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించారు.అయితే భూమికి సంబంధించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం 2024 జులైలోనే టీజీఐఐసీకి బదలాయించింది. దీంతో టీజీఐఐసీ ఈ ఏడాది మార్చి 30న ఆ ప్రదేశంలో చెట్లను నరికివేసి భూమిని చదునుచేసే పనులు మొదలుపెట్టింది."టీజీఐఐసీ వివరాల మేరకు 122 ఎకరాల్లో చెట్లను పూర్తిగా వేర్లతో సహా కొట్టేశారు" అని నివేదికలో సీఈసీ స్పష్టం చేసింది.వాల్టా చట్టం 2004 ప్రకారం కొన్ని మినహాయింపులున్న చెట్లను కొట్టివేయాలంటే సెల్ఫ్ డిక్లరేషన్‌తో కొట్టివేయొచ్చు. ఇందుకు ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌కు ఫారం 13ఏ ఇచ్చి, నిర్దేశిత ఫీజు చెల్లిస్తే సరిపోతుందని అటవీ శాఖాధికారులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు."మార్చి 17నే టీజీఐఐసీ దరఖాస్తు చేసుకుంది. మార్చి 29న అవసరమైన పరిహారం కూడా చెల్లించింది" అని చెప్పారు.125 మినహాయింపు లేని చెట్లను కూడా కూల్చివేసినట్లుగా ఏప్రిల్ 3న చిలుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరిశీలనలో గుర్తించారని సీఈసీ తన నివేదికలో పేర్కొంది.1524 చెట్లను కూల్చివేయగా.. అందులో 1399 చెట్లకు వాల్టా చట్టం నుంచి మినహాయింపులున్నాయి" అని చెప్పింది.సీఈసీ మొత్తం 69 పేజీల నివేదికను సుప్రీంకోర్టుకు ఇచ్చింది. ఇందులో కంచ గచ్చిబౌలి భూములకు 'అడవి' అని చెప్పడానికి కావాల్సిన గుణం ఉందని స్పష్టం చేసింది."ప్రాథమిక పరిశీలన ప్రకారం, ఆ ప్రాంత సహజ లక్షణం, పర్యావరణ పరంగా అడవిని తలపిస్తోంది" అని నివేదికలో పలుమార్లు ప్రస్తావించింది."ఈ ఏడాది మార్చి 4న అటవీ లక్షణాలు కలిగిన భూములు గుర్తించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా చదును చేసే పనులు చేపట్టారు. వన చట్టం 2023ను పట్టించుకోకుండానే టీజీఐఐసీ చదును చేసే పనులు మొదలుపెట్టింది" అని సీఈసీ తన నివేదికలో పేర్కొంది.అలాగే టీజీఐఐసీ కూడా డీపీఆర్ సిద్ధం చేయకుండా నేరుగా అడవి వంటి లక్షణాలు కలిగిన ఆ భూమిని చదును చేయడానికి ముందుకెళ్లిందని సీఈసీ అభిప్రాయపడింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1975లో దాదాపు 2324 ఎకరాలను కేటాయించింది . విశాలమైన ప్రాంతం కావడంతో ఇదంతా పచ్చదనం, చెట్లతో నిండి ఉంటుంది. జింకలు, నెమళ్లు కనిపిస్తుంటాయి.సీఈసీ తన నివేదికలో ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది." ఈ ప్రాంతం పర్యావరణం, పచ్చదనం పరంగా ఉన్నతంగా ఉంది. రాళ్ల అమరికలు, కుంటలు, జీవవైవిధ్యం కారణంగా అక్కడ ఏదైనా పనులు చేయాలంటే కచ్చితంగా గట్టి పరిశీలన జరగాలి. అటవీ చట్టాల ప్రకారం అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవడమైనా సరే, నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది.టీజీఐఐసీ తమకు యాజమాన్య హక్కులు ఉన్నట్లుగా చెబుతున్నప్పటికీ, అన్ని అనుమతులూ తీసుకోలేదు. భూమిని మార్టిగేజ్ చేయడం కూడా ఆర్థికంగా తీవ్రమైన ఉల్లంఘనగా భావించాలి" అని చెప్పింది.ఈ భూమిని బీకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ పేరుతో మార్టిగేజ్ చేసి నాన్-కన్వర్టబుల్ బాండ్లు జారీ చేసినట్లుగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏప్రిల్ 10న సీఈసీకి ఇచ్చిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది.దీనిపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 16న తన విచారణ సందర్భంగా స్పందించింది."భూమిని మార్టిగేజ్ చేశారా లేదా.. అనే విషయం జోలికి మేం వెళ్లదలుచుకోలేదు. మేం జీవ వైవిధ్యం గురించి మాట్లాడుతున్నాం" అని స్పష్టం చేసింది.సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి పనులూ మొదలుపెట్టకూడదుక్షేత్రస్థాయి అటవీ శాఖాధికారులు, వన్యప్రాణుల నిపుణులు, పర్యావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే సంస్థ ప్రతినిధులతో కమిటీ వేసి అటవీ తరహా ప్రాంతాలను గుర్తించాలి.అటవీ చట్టం 2023 ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరంగా ఇబ్బంది లేకుండా భూములను విభజించేందుకు ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి.

సరైన పర్యావరణ నిబంధనలు పాటించకపోవడంతోపాటు 2006నాటి పర్యావరణ ప్రభావిత అంచనా అనుమతులు కూడా తీసుకోలేదు. టీజీఐఐసీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టీజీఐఐసీకి ఇచ్చిన అనుమతిని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రద్దు చేయాలి.వివాదాస్పద 400 ఎకరాలు సహా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంతాన్ని పర్యావరణ సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించి వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలతో సమగ్ర అధ్యయనం చేయించే వరకు అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు జరగకుండా నిరోధించాలి.సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తన నివేదికను సమర్పించారు.400 ఎకరాల్లో పర్యావరణ అనుకూల ఐటీ పార్కు అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ ఆలోచన అని పేర్కొన్నారు."కంచ గచ్చిబౌలి ప్రాంతంలో 2374.02 ఎకరాల భూమి ఉంది. 2003లో అప్పటి ప్రభుత్వం స్పోర్ట్స్ కోచింగ్ అకాడమీ కోసం ఐఎంజీ భారత అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. తర్వాత కేటాయింపు రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ భారత్ హైకోర్టుకు వెళ్లగా.. 2024 మేలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది" అని ప్రభుత్వం తన నివేదికలో ప్రస్తావించింది."20 ఏళ్లుగా ఖాళీగా ఉండటంతో చెట్లు, పొదలు పెరిగాయి. పక్కనే హెచ్‌సీయూలో ఉండే నెమళ్లు, జింకలు అక్కడికి వస్తున్నాయి. ఈ ప్రాంతంలో చిలుకల కుంట ఉంది. దాన్ని పరిరక్షించాలని నిర్ణయం తీసుకున్నాం" అని ప్రభుత్వం స్పష్టం చేసింది.నకిలీ చిత్రాలు, వీడియోలతో కంచ గచ్చిబౌలి భూములపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టుకు వివరించారు .నకిలీ ఫొటోలు, వీడియోలుగా పేర్కొంటూ కొన్నింటిని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది.అయితే, వంద ఎకరాల్లో పచ్చదనం లేదా పర్యావరణాన్ని పునరుద్ధరించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పందించారు."ఆ భూమి ప్రభుత్వానిదేనని గతంలోనే సుప్రీంకోర్టు చెప్పింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తాం" అని మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో చెప్పారు.

# అన్ని విధాల మధుసూధన్ కుటుంబాన్ని...

తనకు మాటలు కూడా రావడం లేదన్నారు.. ఈ ఉగ్రవాద కాల్పులలో మరణించిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ మధుసూధన్ రావు అంత్యక్రియలను నేడు కావలిలో నిర్వహించారు.. ఈ అంత్యక్రియలలో పవన్ స్వయంగా పాల్గొని మృతుడికి కడసారి వీడ్కోలు పలికారు.. నేటి మధ్యాహ్నం కావలి చేరుకున్న పవన్ నేరుగా మధుసూధన్ ఇంటికి చేరుకున్నారు.. అక్కడ ఉన్న మధుసూధన్ బౌతికకాయంపై పూలగుచ్ఛం ఉంచి నివాళలర్పించారు.. ఈ సందర్భంగా మధు కుటుంబ సభ్యులను పరామర్శించారు.. వారికి ధైర్యాన్ని చెప్పారు.. ప్రభుత్వం అన్ని విధాల అదుకుంటుందని భరోసా ఇచ్చారు.. ఈ కాల్పుల ఘటన వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి జరిగిన కాల్పుల ఘటనను మధు సూధన్ భార్య వివరించారు.. మోదీ హయాంలో కశ్మీర్ సురక్షితంగా ఉంటుందనే నమ్మకంతోనే తాము విహారయాత్రకు వెళ్లామని, కానీ ఇంతటి దారుణం జరుగుతుందని ఊహించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కుటుంబాలకు చెందిన పది మంది పహల్గాం విహారయాత్రకు వెళ్లారు. స్థానికంగా 'మినీ స్విట్జర్లాండ్'గా పిలిచే ప్రాంతానికి గుర్రాలపై వెళ్లి, భోజనం చేశారు. మధుసూదన్, ఆయన భార్య ఇద్దరూ భోజనం ముగించుకుని బయటకు వచ్చిన కొద్దిసేపటికే కాల్పుల శబ్దాలు వినిపించాయి. మిస్ గైడ్ తోనే భయంతో వారు పరుగులు తీస్తుండగా, శాలువాలు అమ్మే కొందరు స్థానికులు వారిని అడ్డుకొని, అవి కేవలం కశ్మీరీ వార్షికోత్సవ వేడుకల శబ్దాలని, భయపడాల్సిన పనిలేదని చెప్పి తప్పుదోవ పట్టించినట్లు ఆమె తెలిపారు. "మేము పరిగెడుతుంటే వాళ్ళు మమ్మల్ని మిస్‌గైడ్ చేస్తూ అది కేవలం వేడుకలని, ఇక్కడే ఉండండి అన్నారు" అని ఆమె పేర్కొన్నారు. అయితే, అక్కడే ఉన్న ఒక హోటల్ యజమాని మాత్రం ప్రమాదాన్ని పసిగట్టి, తమ పిల్లలను, ఇతరులను వెంటనే పారిపోవాలని హెచ్చరించినట్లు చెప్పారు. హోటల్ యజమాని హెచ్చరికతో పిల్లలు, కొందరు ముందుగానే పారిపోయారని, కానీ తాము పారిపోయేలోపే ఉగ్రవాదులు కాల్పులు జరుపుతూ దగ్గరకు వచ్చారని మధుసూదన్ భార్య వివరించారు. ఆ సమయంలో తన భర్త, "మనమిద్దరం ఇక్కడే పడుకుందాం, నువ్వు తల ఎత్తవద్దు" అని చెప్పినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఇద్దరూ చేతులు పట్టుకుని నేలపై పడుకుని ఉండగా, ఎవరో నడుచుకుంటూ వచ్చిన శబ్దం వినిపించిందని, వెంటనే ఒక పెద్ద పేలుడు శబ్దం (కాల్పుల శబ్దం) వినిపించిందని తెలిపారు. "ఆ షాట్‌కు ముందు 'హిందూయే? ముస్లిమే?' అని రెండు సార్లు అడిగారు. మేము ఏమీ స్పందించలేదు. వెంటనే షాట్ సౌండ్ వినిపించింది. నేను లేచి చూసేసరికి ఆయన ముఖం మొత్తం రక్తంతో నిండిపోయింది" అని చెబుతూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన దుస్తులు కూడా రక్తంతో తడిసిపోయాయని, ఆ షాట్ తమవైపే జరిగిందని అప్పుడు అర్థమైందని ఆమె వాపోయారు. తన భర్తను కాల్చిన తర్వాత, తాను కూడా బయటకు పరిగెత్తానని, ఎవరైనా రక్షించేవారు కనిపిస్తారేమోనని చూశానని, కానీ ఎవరూ కనిపించలేదని ఆమె తెలిపారు. అక్కడున్న కొందరు తనను ఆర్మీ క్యాంప్ వద్దకు తీసుకెళ్లారని చెప్పారు. ఉగ్రవాదులు అత్యంత క్రూరంగా ప్రవర్తించారని, తమ పక్కనే ఉన్న జైపూర్‌కు చెందిన దంపతులు తమ రెండేళ్ల చిన్నారిని చూపిస్తూ కాళ్లు పట్టుకుని వేడుకున్నా కనికరించకుండా కాల్చి చంపారని ఆమె వివరించారు. "నన్ను కూడా కాల్చేయమని అడిగితే, 'మోదీకి చెప్పుకోండి' (మోదీ కో బోలో) అని అంటున్నారని" ఆమె ఆవేదనతో తెలిపారు. కిందపడిపోయిన వ్యక్తిని సైతం మరోసారి కాల్చారని ఆమె ఉగ్రవాదుల పైశాచికత్వాన్ని వివరించారు. తన భర్తకు ఒకే ఒక్క బుల్లెట్ తగిలిందని, 46 బుల్లెట్లు తగిలాయనే వార్తలు అవాస్తవమని ఆమె స్పష్టం చేశారు. "మోదీ పాలనలో కశ్మీర్ సురక్షితం అనుకునే వెళ్ళాం. కానీ మాకే ఇలా జరుగుతుందని ఊహించలేదు. మా నష్టాన్ని ఎవరు తీర్చగలరు?" అని ఆమె ప్రశ్నించారు. తమలాగే అనేక కుటుంబాలు బాధితులయ్యాయని, కొందరు పిల్లలకు తల్లిదండ్రులు చనిపోయిన విషయం కూడా తెలియని స్థితిలో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఏ విధంగా సహాయం చేస్తుందోనని ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. మధుసూదన్ కుమారుడు మాట్లాడుతూ, తాము గేటు బయటకు వచ్చిన తర్వాత తల్లిదండ్రుల కోసం ఎదురుచూస్తుండగా, కేవలం అమ్మ మాత్రమే తిరిగి వచ్చిందని, నాన్న రాలేదని చెప్పాడు. చెన్నైలో తన తండ్రి పార్థివ దేహానికి అంతమంది సైనికులు సెల్యూట్ చేయడం చూసి గర్వపడ్డానని, తన తండ్రి కోసం, కుటుంబం కోసం ధైర్యంగా ఉంటానని ఆ బాలుడు పేర్కొన్నాడు.

# టెక్నాలజీ వినియోగంతో....

ప్రజల కోసం ఉపయోగపడాలన్నారు. రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని తెలిపారు. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. 2 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజుల నుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దామన్నారు. వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా.. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో ఉన్నతాధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు వర్క్‌షాప్‌కు హాజరై, ప్రారంభోపన్యాసం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్ పరిశీలించనున్నారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పలువురు నిపుణులు వివరించనున్నారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు, రెండోరోజు విభాగాధిపతులు హాజరుకానున్నారు. ఈ వర్క్‌షాప్‌కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్ ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. అలాగే వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్‌తో సహా పలువురు నిపుణులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాకే ఎన్నికలు జరపాలి..


అంశం పూర్తిగా పరిష్కారం కాకముందే, తొందర లోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి సీతక్క ప్రకటించడం దారుణమని అన్నారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. రిజర్వేషన్లను పెంచకుండానే ఎన్నికలకు వెళ్తే రాష్ట్రంలో యుద్ధం తప్పదని హెచ్చరించారు. దీనిపై వెయ్యి మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వ మని అన్నారు. బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ అసెం బ్లీలో చట్టం చేసి, ఇంతవరకు జీవో ఎందుకు జారీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేశాక కేంద్రానికి పంపుతామని ప్రకటనలు వెలువడ్డాయే తప్ప ఇంతవరకు దానిపై అతీగతి లేదని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని అన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, దాన్ని కేంద్రంపై నెట్టివేయడం బీసీలను దగా చేయడం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మీనమేషాలు లెక్కించడం మానుకొని బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీసీల తిరుగుబాటు తప్పదని వార్నింగ్ ఇచ్చారు.

# ఈ సస్పెన్షన్ తాత్కాలికమే...

గాను ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. పార్టీ కోసం నేను చాలా కష్టపడి పనిచేశాను... పార్టీకి గొంతుకలా మారాను... నాడు ప్రతిపక్షాల మీద గట్టిగా విరుచుకుపడ్డాను. ఎంతో కష్టపడి పనిచేసిన నన్ను... అకారణంగా, వ్యక్తిగత కారణాలు అనే కారణంతో సస్పెండ్ చేశారని తెలిసింది. నా హృదయంలో జగన్ మోహన్ రెడ్డి గారు ఎప్పటికీ నిలిచి ఉంటారు. అయితే, రాజకీయ క్రీడలో నేను బలయ్యానేమో అనిపిస్తోంది. పాతికేళ్లుగా ప్రజా జీవితంలో ఉంటూ, ప్రజాసేవనే పరమావధిగా భావించిన నేను ఎప్పుడూ పార్టీకి ద్రోహం చేయలేదు, అవినీతి చేయలేదు, లంచాలు తీసుకోలేదు, అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు, భూకబ్జాలు చేయలేదు... పార్టీ కోసమే అహర్నిశలు పనిచేశాను. తాజాగా జరిగిన పరిణామాన్ని స్వీకరిస్తున్నాను. సస్పెన్షన్ అంటే తాత్కాలిక విరామం అని అర్థం. ఈ తాత్కాలిక విరామాన్ని ప్రకటించినప్పుడు నాకొకటి గుర్తొస్తోంది. గురజాడ అప్పారావు గారు ఓ మాట చెప్పారు... విజయం కోసం విసుగును వీడి విరామమెరుగక పనిచేయండోయ్ అన్నారు... నేను కూడా ఆ విధంగానే విరామం లేకుండా పనిచేస్తాను... కష్టపడి పనిచేస్తాను... స్వతంత్రుడిగా, తటస్థుడిగా, నన్ను నమ్ముకున్న ప్రజల కోసం, నా గ్రామాల కోసం, నాపై ఆధారపడి ఉన్న కార్యకర్తల కోసం, అభిమానుల కోసం నిరంతరం మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాను... ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామగ్రామాల్లో ఇంటింటికీ ఈ దువ్వాడ శ్రీనివాస్ మళ్లీ వస్తాడు... అన్నింటికీ కాలమే తీర్పు చెబుతుంది. నాకు ఇంతటి గౌరవాన్ని ఇచ్చిన టెక్కలి నియోజకవర్గ ప్రజలను ఎప్పటికీ మర్చిపోను. నా ఊపిరి ఉన్నంత వరకు వారి సేవలోనే నిమగ్నమై ఉంటాను. నా సేవలు ఎక్కడ అవసరమైతే అక్కడ నేను ప్రత్యక్షంగా ఉపయోగపడతాను. ఇప్పటివరకు అవకాశం ఇచ్చిన వైసీపీ అధినేత జగన్ కు నా హృదయపూర్వక నమస్కారాలు" అంటూ దువ్వాడ శ్రీనివాస్ తన వీడియోలో పేర్కొన్నారు.

# ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం...

చేశారు. "ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుక కుట్ర పన్నిన వారికి వారి ఊహకు కూడా అందని శిక్ష పడుతుంది. శిక్ష పడి తీరుతుంది. ఉగ్రవాదుల మిగిలిన మూలాలను కూడా మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది," అని ఆయన ఉద్ఘాటించారు. అమాయక ప్రజలను అతి కిరాతకంగా చంపిన ముష్కరులు ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిని శిక్షించి తీరుతామని అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల సమిష్టి సంకల్ప శక్తి ఉగ్రవాదుల వెన్ను విరుస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు.ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి భారతీయుడిలో ఈ దాడి పట్ల తీవ్ర బాధ, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారతదేశం దృఢ సంకల్పంతో ఉందని, ఉగ్రవాద చర్యల ద్వారా దేశ ఐక్యతా స్ఫూర్తిని దెబ్బతీయలేరని ఆయన అన్నారు.ఉగ్రదాడిని ఖండిస్తూ, భారత్‌కు అండగా నిలిచిన అంతర్జాతీయ సమాజానికి, వివిధ దేశాల నాయకులకు ప్రధానమంత్రి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు మద్దతుగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ వెనకడుగు వేయదని, న్యాయం జరిగేలా చూస్తామని ప్రపంచానికి సందేశం ఇచ్చారు. "భారతదేశం ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, వెంటాడి శిక్షిస్తుంది," అని బిహార్ వేదికగా ప్రధాని స్పష్టం చేశారు. అంతకుముందు, బిహార్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, దేశ వేగవంతమైన అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని ప్రధాని నొక్కి చెప్పారు. 'వికసిత భారత్' లక్ష్య సాధనకు 'వికసిత బిహార్' నిర్మాణం ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.



# సింధు జలాల ఒప్పందాన్ని...

ఈ కఠిన నిర్ణయాలకు పాకిస్థాన్ కూడా ప్రతిచర్యలకు దిగింది. భారత విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించకుండా నిషేధం విధించింది. ఇరు దేశాలు తీసుకుంటున్న ఈ నిర్ణయాలతో సరిహద్దుల్లోనూ, దౌత్యపరంగానూ ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతర పరిణామాలు, ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి రాష్ట్రపతికి వివరించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన చిత్రాన్ని రాష్ట్రపతి భవన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు.

**దౌత్యపరమైన చర్యలు :**

మరోవైపు, పహల్గాం ఉగ్రదాడి ఘటనపై అంతర్జాతీయ సమాజానికి వివరించే ప్రయత్నాల్లో భాగంగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. చైనా, కెనడా సహా పలు జీ20 దేశాలకు చెందిన రాయబారులతో విదేశాంగ శాఖ అధికారులు సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో ఉగ్రదాడికి సంబంధించిన వివరాలు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి వివరించినట్లు తెలుస్తోంది.


# పహల్గామ్ దాడి...

చేసుకున్నారని, పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేశారని షర్మిల గుర్తుచేశారు. ఏటా కోట్లాది మంది పర్యాటకులు సందర్శించే కశ్మీర్ వంటి సున్నితమైన ప్రాంతంలో భద్రతా లోపం ఎందుకు తలెత్తిందని ఆమె ప్రశ్నించారు. "పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుంటే అక్కడ కనీస భద్రతా సిబ్బంది లేకపోవడం దారుణం. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే. ఇంతమంది ప్రాణాలు కోల్పోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం" అని షర్మిల పేర్కొన్నారు.ఉగ్రవాదాన్ని నియంత్రించాల్సిన బాధ్యత బీజేపీ ప్రభుత్వంపై ఉందని, 'చౌకీదార్' అని చెప్పుకునే మోదీ పాలనలో ఇదేనా భద్రత కల్పించే తీరు అని ఆమె నిలదీశారు. ఈ ఘటన స్పష్టంగా నిఘా వైఫల్యమని, దేశ నిఘా వ్యవస్థలు దేశం కోసం కాకుండా, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారిపైనే దృష్టి సారిస్తున్నాయని ఆమె ఆరోపించారు. "దేశ దర్యాప్తు, నిఘా వ్యవస్థలను సొంత రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారు. నిఘా వర్గాల బలం అంతా ప్రధాని మోదీ కోసం పనిచేస్తోంది తప్ప, దేశ భద్రత కోసం కాదు" అని షర్మిల విమర్శించారు.ఇంత ఘోరంగా భద్రతా వ్యవస్థలు విఫలమైన ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కు లేదని షర్మిల అన్నారు. వీరు దేశానికి కాదు, బీజేపీకి చౌకీదార్లని ఆమె వ్యాఖ్యానించారు. దేశ భద్రతను పూర్తిగా గాలికొదిలేశారని, ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ తప్పిదమేనని ఆమె స్పష్టం చేశారు. ఈ దాడిలో ఒక ముస్లిం వ్యక్తి కూడా మరణించారని గుర్తు చేస్తూ, దేశంలోని ముస్లింలందరినీ చెడ్డవారిగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆమె ఆరోపించారు. "ఈ దేశంలో మతం పేరుతో యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారు. అంతర్గతంగా భద్రత కరువైంది. అన్ని మతాలు సమానం అనే భావన లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితులు తీవ్రవాదులకు అవకాశమిచ్చినట్లు అవుతుంది. మోదీ తన సమయాన్ని, శ్రమను దేశ భద్రతపై కేంద్రీకరించి ఉంటే బయటి శక్తులు ఇలా చొరబడే పరిస్థితి ఉండేది కాదు" అని షర్మిల అభిప్రాయపడ్డారు.

# జగనన్న పథకాలు ప్రజలకు...

స్పష్టత కొరవడిందని అన్నారు.ప్రభుత్వ అప్పుల లెక్కలపై ప్రజల్లో గందరగోళం నెలకొందని బుగ్గన పేర్కొన్నారు. అప్పుల గణాంకాలను కొందరు 'మట్కా లెక్కల' మాదిరిగా చెబుతున్నారని ప్రజలు అనుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం దృష్ట్యా నమ్మకం ఉంచారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని ఆయన అన్నారు. కేంద్రంలో మద్దతు ఉందని చెప్పుకుంటున్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఎటువంటి సానుకూల మార్పు కనిపించడం లేదని ఆయన ఆరోపించారు.వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర పన్నుల ఆదాయం రూ. 81,400 కోట్లుగా ఉందని బుగ్గన గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఆదాయం, తమ హయాంతో పోలిస్తే 7.5 శాతం తక్కువగా ఉందని, సంపద సృష్టి తగ్గిపోయిందని ఆయన ఆరోపించారు. "సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ.. ఇదే కూటమి ప్రభుత్వ పనితీరు" అని ఆయన ఎద్దేవా చేశారు. తాము సామాన్య ప్రజల సంక్షేమం కోసం పాలన సాగించామని, వైసీపీ అప్పులు చేసిందని విమర్శించే కూటమి ప్రభుత్వం, అంతకంటే ఎక్కువ అప్పులు చేసి ఆ నిధులను ఎవరికి పంచుతోందని ఆయన నిలదీశారు.జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమలైన పథకాలు ప్రస్తుతం ప్రజలకు అందడం లేదని బుగ్గన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో, కూటమి ప్రభుత్వం ఇస్తామన్న హామీలు, పథకాలు కూడా కార్యరూపం దాల్చడం లేదని విమర్శించారు. మరి ఈ పరిస్థితుల్లో రాష్ట్ర సంపద అంతా ఎక్కడికి వెళుతోందని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

# 14 మంది మావోయిస్టులు లొంగుబాటు



హన్మకొండ : మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో 14 మంది మావోయిస్టులు లొంగుపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు కాగా 12మంది మిలీషియన్ సభ్యులు. వీరిలో 13 మంది ఛత్తీస్‌గఢ్, ఒకరు తెలంగాణకు చెందినవారు ఉన్నారు. లొంగిపోయిన వారికి రూ.25వేల చొప్పున రివార్డు అందజేశారు. అలాగే కర్రెగుట్ట ఆపరేషన్‌కు తెలంగాణ పోలీసుల ప్రమేయం లేదని ఐజీ తెలిపారు. కాగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలముకున్నాయి. వేల సంఖ్యలో భద్రత దళాలు కర్రెగుట్టలను చుట్టుముట్టాయి. ఈ ఆపరేషన్‌లో వాయుసేన వేగాన్ని పెంచింది.. ఆపరేషన్ 'కగార్' పోరు తుది దశకు చేరుకునే పరిస్థితులు నెలకొన్నాయి.. సెర్చింగ్ ఆపరేషన్ నిలిపివేయాలంటూ మావోయిస్టు పార్టీ నేతలు రాసిన లేఖను కేంద్రం కొట్టిపడేసినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం మావోయిస్టులు, భద్రత దళాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్లు సమాచారం.

## మా గ్రామానికి మా పొలాలకు....
## రోడ్డు ఉపయోగం



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: ఎస్ఆర్ పురం మండలం వెంకటాపురం పంచాయతీలో పేరుమాలక్క చెరువు కట్ట పైనుంచి మా పొలాలకు ఆ రోడ్డు పని చేస్తే మాకు ఎంతో ఉపయోగమని పొదలపల్లి గ్రామస్తులు తెలిపారు ఈ రోడ్డు వల్ల మా పొలాలకు పొదలపల్లి గ్రామానికి సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు తెలియజేశారు.

## కర్ణం చిన్న స్వామి నాయుడు....
## సేవలు చిరస్మరణీయం..
### టిడిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.ఆర్ రాజన్



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కర్ణం చిన్న స్వామి నాయుడు సేవలు చిరస్మరణీయం అని తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సిఆర్ రాజన్ అన్నారు. గురువారం ఎస్ఆర్ పురం మండలం వడ్డే పల్లి గ్రామంలో కర్ణం చిన్నస్వామినాయుడు ఉత్తరక్రియలు సందర్భంగా ఆయన చిత్ర పటానికి టిడిపి జిల్లా అధ్యక్షు డు సి ఆర్ రాజన్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో యాదవ సాధికారసమితి జిల్లా అధ్యక్షు డు శ్రీధర్ యాదవ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ చంద్ర నాయుడు విజయకుమార్ మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు తిరుమల జ్యోతి ప్రకాష్ నాగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి కి ......
## ప్రత్యేక పూజలు



కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24: పులిచెర్ల మండలం జిల్లా వారి పల్లిలో వెల సిన శ్రీ మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు,పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు.ఆలయంలో ఉదయం స్వామి వారిని మునికృష్ణ ,మాధవి దంపతులు తన కుమారుడి నామకరణం సందర్భంగా స్వామివారికి అభిషేకం పూజలు నిర్వహిం చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయ దారులు భక్తులకు అన్నదాన కార్యక్రమం వహించారు. స్వామి వారి కృప కటాక్షాలు పొందడానికి ఉభయదారులు,బంధు మిత్రులు తదితరులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ ను.....
## అభినందించిన ఎమ్మెల్యే అమర్



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ -2025 విజేతను పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి అభినందించారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను పారిస్ కు చెందిన మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ -2025 విజేత ఎం. జ్ఞాకరణ్ శ్రీకరణ్ గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన పారిస్ లో ఈ పోటీలల్లో మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ గా బరిలో నిలిచి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచి విజేతగా రాణించారు. తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన ప్రముఖ వ్యాపారి రాజన్ ప్రభాకర్ తో కలసి తమిళనాడు, ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొంతమంది సీనియర్ రాజకీయ అనుభవం ఉన్న నేతలను ఆయన కలిశారు. అందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యేను వారు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అతన్ని స్థానిక కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురున్నారు.

## జాతీయ పంచాయతీరాజ్
## దినోత్సవం కార్యక్రమం



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి పంచాయితీలో గురువారం రోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక సర్పంచ్ బండి ఆనంద్ రెడ్డి అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంపీడీవో పి పురుషోత్తం పాల్గొన్నారు. మరియు సెక్రటరీ కే ధనలక్ష్మి సచివాలయం సిబ్బంది గ్రామ ప్రజలు వార్డు మెంబర్లు పంచాయతీ సిబ్బంది, అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## పహల్గమా ఉగ్ర దాడిలో.....
# ప్రాణాలు వదిలిన భారతీయులకు అశ్రునివాలు

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24:(శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్ర దాడిలో అమాయక ప్రజలు,భద్రతా సిబ్బంది అమరులయ్యారు. వారికి కొవ్వొత్తులతో తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ దాడి లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కు సంతాపాన్ని తెలియజేశారు. గాయపడి న వారికి త్వరితగతిన ఆరోగ్యవంతులవ్వా లని ఆకాంక్షించారు. దేశ భద్రత కోసం పని చేసే వారిత్యాగం ఎప్పటికీ మరువలేనిదని, ఇటువంటి హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఇలాంటి దుశ్చ ర్యలు దేశాన్ని




కుదిపేయలేవని, మన సైని కుల ధైర్యం మరియు ప్రజల ఐక్యత వాటికి బలమైన సమాధానం ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్య నాయుడు,మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు రేణుకా దేవి,మైనార్టీ సెల్ షాకిరాలి,సాజిద్, శ్రీకాళహస్తి నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య
## దాడిని తీవ్రంగా నిరసన, కొవ్వొత్తుల ర్యాలీ.

వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం లో వరదయ్యపాలెం స్థానికబస్టాండ్ జంక్షన్ వద్ద నుండి వెంకటేశ్వరస్వామి గుడి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా భారతమాత వర్ధిల్లాలి, ఉగ్ర వాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగ కూటమి నాయకులు మాట్లాడుతూ దుర్మార్గమైన ఉగ్రవాద దాడులతో దేశ సమగ్రతను ఎవరూ భగ్నం చేయలేరన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న వారందరు దిగ్భ్రాంతికి గురయ్యారన్నారు. అమాయకుల ప్రాణా లను బలిగొన్న అరాచక వాదులను పట్టు కుని కేంద్ర ప్రభుత్వం వెంటనే శిక్షించాల న్నారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు వరదయ్యపాలెం మండలం తరపున సంతాపాన్ని తెలియజేశారు.మన సైనిక బలగాలు దేశ రక్షణలో నిత్యంఅపార త్యాగాలు చేస్తుంటే,దేశ గౌరవాన్ని దెబ్బ తీసేందుకే ఉగ్రవాదులు ఇటువంటి దుశ్చ ర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఉగ్ర వాదాన్ని తరిమి కొట్టేందుకు కుల మతాల కతీతంగా దేశమంతా ఒక్కటై ముందుకు సాగుతూ,జాతీయ భావాన్ని తెలియజేయా లన్నారు. ఉగ్రవాదులను ఏరివేసేందుకు మరింత కఠినమైన చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్య క్రమంలో వరదయ్యపాలెం మండలంకు చెందిన నాయకులు,దేశభక్తులు తదితరు లు



పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో తడ శ్రీనివాసులు,సురేశ్ రెడ్డి,ఢిల్లీ ప్రకాష్, నరస రాజు,బొందుభారతి,మునిభూషణమ్మ,చిన్నిరాజ్, సిద్దులయ్య,భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు,రవి రెడ్డి,గుత్తి త్యాగరాజు,రెడ్డి శేఖర్,వెట్టి సాగర్, చెంగయ్య,తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పర్యాటకులపై ఉగ్ర చర్య హేయం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్








శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24: శ్రీకాళహస్తి జమ్ము కాశ్మీర్‌లోని పహల్గమ్‌లో పర్యాటకులను పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవా దులు చంపడం హేయమైన చర్య అని శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్. కోటేశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి హరీష్ రాయల్, అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సమాజానికి పెనుము ప్పుగా మారిన తీవ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తీవ్రవా దాన్ని అంతమొందించడానికి ప్రతిఒక్కోరూ సమిష్టిగా పోరాడాలన్నారు.ఇలాంటి దుశ్చ ర్యలు దేశాన్ని కుదిపేయలేవని మన సైనికు ల ధైర్యం, ప్రజల ఐక్యత వాటికి బలమైన సమాధానం విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. పాకిస్థానీలు ఇండియాలో ఎక్కడా ఉండ కుండా వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చార న్నారు. దీనిని ప్రపంచ దేశాలు కూడా అమలు చేసి ఉగ్రవాద నిర్మూలనకు భారత దేశానికి సహకరించాలన్నారు. ఉగ్రచర్యలో మృతి చెందిన కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలి.....
# బిసి విభాగం,తెలుగుదేశం పార్టీ

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: శ్రీకాళహస్తి ప్రపంచానికి పెను ప్రమాదకరంగా మారిన వేర్పాటు వాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు.కాశ్మీర్ లోని పహల్గమ్ లో జరిగిన ఉగ్రదాడిలో ఏపీ వాసులైన చంద్రమౌళి, మధుసూధనరావులు మరణించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈరోజు స్థానిక పూసల వీధి కూడలిలో వారి చిత్రపటాల ముందు కొవ్వొత్తులను వెలిగించి నివాళులు అర్పించారు. ఉగ్రవాద దాడి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కార్యక్రమంలో పాల్గొన్నవారు మాటిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ సమాజానికి పెను ముప్పుగా పరిణమించిన తీవ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయకపోతే అది మానవ మను గడను ప్రమాదంలో పడేస్తుందని హెచ్చరిం చారు. కాబట్టి,ప్రపంచ లోని ఏ ప్రాంతంలో నైనా తీవ్రవాదాన్ని అంతమొందించడానికి ప్రతీ ఒక్కరూ సమిష్టిగా పోరాడాలని పిలు పునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,సీనియర్ నాయకు లు లక్కమనేని మధుబాబు, పేట బాలాజీ రెడ్డి, రాజేంద్రప్రసాద్,




నాయీ బ్రాహ్మణ సాధికార సమితి,తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు దొరైరాజ్ రెడ్డి, ప్రధాన కార్య దర్శి మునిరాజా యాదవ్, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు సయ్యద్ చాంద్ బాషా, నూర్ మొహమ్మద్, షేక్ రియాజ్, సులేమాన్, బిసి విభాగం నాయకులు భాస్కర్, మణి, వినయ్, మునెయ్య, సోము, చంద్ర, కృష్ణమూర్తి, రఫీ, బిజెపి నాయకులు జలగం ముని, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: ఎస్ఆర్ పురంమండలంలో జాతీయపంచా యతీ రాజ్ దినోత్సవాన్ని మండల అధ్యక్షు లు,ఎంపీటీసీ మెంబర్లు వారి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయము శ్రీరంగరాజపురం నందు ఘనముగా నిర్వ హించడం జరిగింది, ఈ సందర్భంగా 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1992 ద్వారా భారత దేశంలో మూడు స్థాయిలలో స్థానిక సంస్థలు ఏర్పాటు కాబడినాయి,1. గ్రామ పంచాయతీ(గ్రామస్థాయి)2.మండల పరిషత్(బ్లాక్ స్థాయి) 3. జిల్లా పరిషత్ (జిల్లాస్థాయి) 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1992 ద్వారా భారత దేశంలో ప్రతిష్టాత్మక పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధ హోదా కల్పించబడిందని తెలియజేయడం జరిగింది, రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు అధికారా లు బాధ్యతలు నిధులు విధులు పై స్పష్టత గురించి తెలియజేయడం జరిగింది, పంచా యతీ రాజ్ వ్యవస్థ యొక్క పాత్ర గురించి గ్రామాలు అభివృద్ధి చెందడంతోనే దేశాభి వృద్ధి చెందుతుందనీ ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. తదుపరి 23 గ్రామపంచాయతీలలో సర్పంచుల ఆధ్వ ర్యంలో గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల మేరకు గ్రామ సభలు నిర్వహించడం అయినది, ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ మెంబర్లు సర్పంచులు, ఎంపీ డీవో జె మోహన మురళి, విస్తరణాధికారి కోదండరామిరెడ్డి,ఏపీఎం రోజా,ఏపీవో లలిత,ఏ ఈ లు కుమార్,సునీల్ టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి బాల ఫీల్డ్ అసిస్టెంట్ రవి సుధాకర్ రాజేష్ నేతాజీ కార్యాలయ సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు.

## గంగజాతరకు ఎమ్మెల్యేను .....
## ఆహ్వానించిన గ్రామస్థులు




గంగవరం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24: పలమనేరు నియోజకవర్గ గంగవరం మండలంలోని పత్తికొండలో వైభవంగా నిర్వహించనున్న శ్రీ పెద్ద పులి గంగమ్మ జాతరకు విచ్చేయాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని పంచాయతీ వాసులు గురువారం ఆహ్వానించారు. ఏటా వైభవంగా జరగనున్న ఈ పండుగను ఈ నెల 29న అమ్మవారి శిరస్సు మెరవాణి 30 జాతర, మే 1వ తేదీన అమ్మవారి జలది నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను మర్యాద పూర్వకంగా సన్మానించి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, హరిబాబు, రంగప్ప, పార్థీష్, విశ్వనాథ్, పతి తదితరులున్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ ....
## దినోత్సవం



కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24: పులిచెర్ల మండలం గడ్డం వారి పల్లి పంచా యతీ పరిధిలో గురువారం జాతీయ పంచా యతీరాజ్ దినోత్సవం ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్య దర్శి ప్రవీణ్ కుమార్ పంచాయతీ పాలన లో చేపడుతున్న అభివృద్ధి పనులు పారి శుద్ధ కార్యక్రమాలు నిధులు మంజూరు తదితర వాటిపై సమగ్రంగా వివరించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి గ్రామ స్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షులు ఇన్నయతుల్లా,సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి....
## నిర్విరామ కృషి చేస్తా...
### వి. హరి ప్రసాద్ రెడ్డి



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: అన్నమయ్య జిల్లా పీలేరు వైయస్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసి డెంట్ గా వి.హరిప్రసాద్ రెడ్డిని నియామకం చేసినట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియామ క ఉత్తర్వులను విడుదల చేసింది.ఈ సంద ర్భంగా వి .హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గారికి హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తన నియామకా నికి సహకరించిన పెద్దలు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి,రాజంపేట పార్ల మెంట్ సభ్యులు మిథున్ రెడ్డికి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డికి ,పార్టీ అనుబంధ విభాగా



ల కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు,పార్టీ బలోపేతం కోసం నిర్విరామ కృషి చేస్తానని తెలిపారు.

## చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ .....
## క్రీడాకారులకు క్రీడా దుస్తులు వితరణ

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24: అంతర్ జిల్లా సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు బి సి ఎన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 30 వేల విలువగల క్రీడ దుస్తులను అందించారు. ఈ సందర్భంగా బి సి ఎన్ విద్యాసంస్థల అధినేత బి సి నాగరాజ్, వైస్ చైర్మన్ డా. సునీల్ రాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉదేశం తో ప్రతి సంవత్సరం క్రీడ దుస్తులను,క్రీడ పరికరాలు అందిస్తున్నామని చెప్పారు. అదేవిదంగా చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేష్ మాట్లాడు తూ క్రీడల అభ్యున్నతికి ఎల్లపుడు సహ కరిస్తున్న బి సి ఎన్ విద్యాసంస్థల యాజ మాన్యానికి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమానినికి కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు , వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్,శరవణన్,పి.ఆర్.ఓ. ప్రవీణ్,పి.ఈ.టి.వేణు,ఎన్ ఎస్ కోఆర్డినేటర్ గంగాధర్ మరియు లియో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.



## రోడ్డుకు ఇరుపక్కల ఉన్న....
# పేడదెబ్బలను తొలగింపు కార్యక్రమం



వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీలో రోడ్డుకు ఇరుపక్కల ఉన్న పేడదెబ్బలను తొలగించడం జరిగినది కార్యక్రమానికి మండల ఎంపీడీవో పురుషోత్తం మరియు స్థానిక సర్పంచి సెక్రటరీ సచివాలయం సిబ్బంది మరియు గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గుడిపల్లి మండలం పంచాయతీ కార్యదర్శుల.....
# యూనియన్ కమిటీ ఏర్పాటు



గుడిపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలో గల పంచాయతీ కార్యదర్శుల 1-6 సంక్షేమం మరి భద్రత కోసము గుడిపల్లి మండలం ఎంపీడీవో మరియు ఇఓపిఆర్డి సమక్షంలో పంచాయతీ కార్యదర్శుల యూనియన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా బాబు యామ్గానపల్లి సెక్రటరీ, ఉపాధ్యక్షులుగా పూంగోడి చిన్న గొల్లపల్లి సెక్రెటరీ, జనరల్ సెక్రెటరీ గా సి వై శివ కుమార్ దాసమానిపల్లి సెక్రటరీ, ట్రెజరర్ గా సూర్య గుండ్ల సాగరం మరియు కమిటీ మెంబర్స్ గా సుధాకర్, నళిని, గోవింద్ ,సుబ్రహ్మణ్యం రెడ్డి , రూపేష్ నియామకము చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత మరియు సంక్షేమం కోసం యూనియన్ అనేది ఎంతో అవసరమని తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా పెద్దపులి....
# గంగమాంబ కుంబాభిషేకం



వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 24. : వీకోటమండలం పాముగాని పల్లి పంచాయతీ గొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో దైవ కార్యము చేత తలపెట్టిన శ్రీ పెద్దపులి గంగ మాంబ ఆలయంలో పెద్దపులి గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన మరియు ఆలయ గోపురం పైన కుంభాభిషేకములను మేళ తాళాలు మధ్యన గ్రామస్తుల సహకారము తో ఆలయ ధర్మకర్త పురుషోత్తమనాయు డు సహాయ సహకారాలతో దైవ కార్యక్ర మాలను అతి వైభవంగా నిర్వహించినా రు. ఈ సందర్భంగా గ్రామములోని రైతులు మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మ



వారికి కలిశారు. ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పిస్తూ కుంభాభిషేకానికి అవసరమై నటువంటి ధాన్యాన్ని గ్రామస్తులు సమ కూర్చి అభిషేకించడం జరిగినది. ఈ కార్య క్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించినారు.గుమ్మిరెడ్డిపల్లి గ్రామస్తులతో పాటు మండలంలోని అనేక గ్రామాల నుండి భక్తులు ఈ కార్యక్రమానికి పాల్గొని పెద్దపల్లి గంగమ్మ వారి ఆశీస్సులు పొందినారు.

# నాటకాల రాయుడికి చెక్...

శ్రీకాకుళం, : వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ నాయకత్వం దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు రావడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అర్థమవుతుంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై వరసగా ఫిర్యాదులు రావడంతోనే శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే ఇది ఒక నాటకంగా ప్రత్యర్థి పార్టీలు చెబుతున్నాయి. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి కూడా దువ్వాడను తప్పిస్తేనే జనం నమ్ముతారంటున్నారు.. గతంలోనూ ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలోనూ ఇదే జరిగిందన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలో నాడు అనంతబాబు జైలుకు వెళ్లారు. నిందితుడిగా చేర్చిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దళిత వ్యక్తిని చంపడమే కాకుండా తన కారులోనే పార్శిల్ చేసి ఇంటికి తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం అప్పట్లోనే సంచలనం కలిగించింది. అయితే అనంతబాబుపై పార్టీ పరంగా చర్యలు తీసుకున్న వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి మాత్రం వేటు వేయలేకపోయింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆ పనిచేయకపోవడంతో ఆ ఘటన పార్టీ ఓటమికి ఒక కారణంగా మారిందనే చెప్పాలి.ఇక దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం కొత్తగా జరగట్లేదు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న తంతు ఇది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ డ్రామా నడుస్తుంది.

## ద్రావిడ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక రిజిస్ట్రార్ పద్మశ్రీ డాక్టర్ బి.రామకృష్ణారెడ్డి మరణానికి నివాళులు అర్పించిన.....
# విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి





గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం లోని ద్రావిడ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక రిజిస్ట్రార్ పద్మశ్రీ డాక్టర్ బి.రామకృష్ణారెడ్డి అకాల మరణానికి ద్రావిడ విశ్వవిద్యాలయం శోకసముద్రంతో నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి నివాళులు అర్పిస్తూ పద్మశ్రీ బి.రామకృష్ణ విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరియు సాహితీ లోకానికి ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. ఈ సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఆయనకి పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసినది అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ డీన్ ఆకడమిక్ అఫైర్స్ ఆచార్య కె.శ్యామల మాట్లాడుతూ భాషా శాస్త్రానికి ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. ఈ సంతాప కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉద్యోగులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గురించి స్మృతించుకొని వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజనీర్ ఎం.సి.రఘుపతి,ఉద్యో గస్తులు, పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వెదురుకుప్పం మండల కేంద్రంలో ఎంపీ లాడ్స్ ద్వారా .......
# హైమాస్ట్ ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలి
### : టిడిపి యువ నేత పేట చూడామని రెడ్డి

వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రధాన కూడలి,భారతం మిట్ట కూడలి రాత్రి వేళలో చిమ్మ చీకట్లో ఈ రెండు కూడలి ఉంటాయి కాబట్టి వెదురుకుప్పం మండలం ప్రధాన వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ రెండు కూడలిలో మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్మెంట్ స్కీం (ఎంపీ లాడ్స్)క్రింద చిత్తూర్ ఎం.పీ.దుగ్గిమల్ల ప్రసాదరావు మరియు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ వి.ఎం థామస్ వారి ఇరువురి చొరవతో మండల కేంద్రంలో రెండు చోట్ల హైమాస్ట్ ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయవలెను టిడిపి యువనేత పేట చూడామనీ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# పహల్గాంలో ఉగ్రదాడి ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది
## మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా
## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ఉన్న పర్యాటకులపై ఉగ్రమూక లు దాడి చేసిన ఘటన కాశ్మీర్ నే గాక దేశాన్నే కుదిపేయడం పై గురువారం ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.పహ ల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య ఆయన ఖండించారు. ఈ దాడిలో 26 మంది చనిపోవడం, మరి కొంత మంది గాయపడ టం తనను బాధిం చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సాను భూతి తెలిపారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు తెలి యజేశారు.ఈ దాడిలో మరణించిన వాళ్ల లో ముగ్గురు తెలుగు



వాళ్లు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలబడం అభినందనీ యమన్నారు. అలాగే ఉగ్రవాదం పై పోరుకు యావత్ దేశం కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## రెండో రోజు సంతాప దినం,.....
# జనసేన పార్టీ కుప్పం నియోజకవర్గం





కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 24: తీవ్రవాదుల దాడిలో మరణించిన జనసేన కార్యకర్త,నెల్లూరు జిల్లా కావాలి చెందిన మధుసూదన్ రావుకి కుప్పం నియోజక వర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కుప్పం బస్ స్టాండ్ సర్కిల్లో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో వారి చిత్రపటానికి పూజా కార్య క్రమం చేసి ఘనంగా నివాళులు అర్పించ డం జరిగింది పార్టీ ఇంచార్జి నరేష్ మాట్లా డుతూ మధుసూదన్ రావు శరీరంలోకి దూసుకెళ్లిన 42 బుల్లెట్లు, జనసైనికుడు కదా ఆ తీవ్రవాద మూర్ఖులకు ఎదురు తిరిగి పోరాడాడు అనుకుంటా అందుకే అన్ని బుల్లెట్లు కాల్చారు.అని తెలియ చేశారు. గురువారం రోజు 3గంటలకు పవన్ కళ్యాణ్, కావలిలో మధుసూదన్ నివాసం చేరుకొని వారి భౌతికాయానికి నివాళులు అర్పించనున్నారు.అని తెలియ చేశారు.జనసేన పార్టీ కార్యాలయం కుప్పం నియోజకవర్గం

## పెరుగుతున్న బంగారం ధరతో...
# స్వర్ణకారుల అవస్థలు



రాజమండ్రి , : బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. పది గ్రాముల పసిడి త్వరలో లక్షా పాతికకు వెళ్తుందని అంచనా. బంగారం ధర ఆకాశాన్నంటుండటంతో మధ్యతరగతి ప్రజలు బంగారు వైపు చూసేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా బంగారు వస్తువులు చేయించుకోవడానికి గోల్డ్ స్మిత్ వర్కర్స్ దగ్గరికి రావడం మానేశారు. దీంతో ఉన్న వ్యాపారం పోయి గోల్డ్ స్మిత్ వర్కర్లు డీలాపడ్డారు. ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా ఉందంటున్నారు స్వర్ణకారులు.స్వర్ణకారులు సాధారణంగా బంగారం, వెండి తోపాటు ప్లాటినం వంటి లోహాలను ఉపయోగించి ఆభరణాలు, ఇతర అలంకరణ వస్తువులను డిజైన్ చేయడం, క్రాఫ్టింగ్ చేయడం, మరమ్మతు చేయడం, సవరించడం వంటి పనులను చేపడతారు. ఒక బంగారు వస్తువు తయారు చేయాలన్నా.. వస్తువు రీప్లేస్‌మెంట్ చేయాలన్న చాలా నిశిత దృష్టి అవసరం. అలాంటి స్వర్ణకారుడు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మెయిన్ రోడ్ లో 700కి పైగా బంగారు షాపులు ఉన్నాయి. ఇందులో వందలాది మంది స్వర్ణకారులు పనులు చేసుకుంటున్నారు.తాజాగా పెరిగిన బంగారం ధరలతో బంగారం కొనుగోలు చేయలేక మధ్యతరగతి వారు కూడా కనీసం షాపులకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలని కోరుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు బంగారు ఆభరణాలు తయారు చేయడానికి తమ వద్దకు రాక పనులు లేక స్వర్ణకారులు షాపులు వెలవెలబోతున్నాయి. స్వర్ణకారుల షాపుల వద్ద పనులు లేక కొన్ని షాపులు మూసేస్తే మరికొన్ని షాపుల వద్ద ఖాళీగా పనిలేక నిరాశతో ఉన్నారు.బంగారు ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే ప్రజలు మునుపటి కంటే తక్కువ బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. తత్ఫలితంగా, స్వర్ణకారులు ప్రతికూలంగా ప్రభావితమవుతున్నాయి అంటున్నారు. చాలా మంది చేతి వృత్తులవారి జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని, ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ స్వర్ణకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో స్వర్ణకారులకు లోన్లు రాక.. ఇటు పనులు లేక కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వాపోతున్నారు. బంగారం ధర పెరుగుదలతోపాటు.. పెద్ద పెద్ద లగ్జరీష్ బంగారం షాపులు వచ్చేయడంతో పనులు బాగా తగ్గిపోయిని వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ఏదైనా భృతి ప్రకటించాలని కోరుతున్నారు రాజమండ్రి స్వర్ణకారులు.తూర్పుగోదావరి జిల్లాలో ఒక రాజమండ్రిలోనే వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఈ సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇక చుట్టుపక్కల స్వర్ణకారులైతే మరొక 3,000 నుంచి 4,000 మంది వరకు ఉంటారు. పూర్వపు ఉమ్మడి గోదావరి జిల్లాలో దాదాపు వేలాది మంది స్వర్ణకారులు పరిస్థితి ఇలాగే ఉందని అంటున్నారు. ఆభరణాల తయారీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఈ వృత్తికి ప్రాధాన్యత తగ్గడం.. మరోవైపు బంగారు ఆభరణాలు రేటు అధికమవడం.. వెరసి సామాన్య స్వర్ణకారుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

# కొండగట్టులో కోతులు

కరీంనగర్, : జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వాం దేవస్థానానికి ప్రతి రోజూ పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచీ.. ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక్కడ కొండపైన కొలువై ఉన్న అంజనేయస్వామి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చాలా యేళ్లుగా కోతులు ఉన్నాయి. అయితే.. గతంలో.. కొండపైన భారీ వృక్షాలు.. వివిధ రకాల పండ్ల చెట్లు ఉండటంతో.. ఎలాంటి సమస్య రాలేదు. అయితే అటవీ విస్తీర్ణం తగ్గడంతో పాటు పండ్ల చెట్లు కనుమరుగువుతున్నాయి. దీంతో కోతులన్నీ ఇక ఆలయానికి చేరుకుంటున్నాయి. మొత్తం ఆలయ పరిసర ప్రాంతాల్లోనే కోతులు సంచరిస్తున్నాయి. 15 యేళ్లుగా కోతులు భక్తులను ముప్పితిప్పలు పెడుతున్నాయిఈ నేపథ్యంలోనే కోతుల ఆహారం కోసం గతంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కొండ కింద.. మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచి.. వాటిని అక్కడికి తరలిస్తామని నిర్ణయం తీసుకున్నారు. కానీ, కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. తరువాత ఇక్కడ ఎలాంటి పండ్ల మొక్కలు నాటలేదు. ఆహారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కోతులన్నీ కొండపైన తిష్ట వేస్తున్నాయి. కొండ సమీపంలో చెట్లు ఉన్నా.. అధికంగా కలప చెట్లు ఉంటాయి. పండ్ల చెట్లు లేవు. దీని కారణంగా భక్తులను వానరాలు టార్గెట్ చేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాయి. భక్తుల చేతిలో ఏం ఉంటే.. అవి ఎత్తుకొని వెళ్తున్నాయి.ఇక్కడ ప్రసాదం తీసుకోవాలంటే.. భక్తులు భయపడుతున్నారు. అంతేకాకుండా చాలా మంది భక్తులు స్వామి వారి సన్నిధిలో గడుపుతారు. వంట చేసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంది. ఆహార పదార్థాలు ఎత్తుకొని వెళ్తున్నాయి. భక్తులు చేతిలో కర్ర పట్టుకొని కాపాలా ఉంటున్నారు. ముఖ్యంగా కొండగట్టులో ఎలాంటి పండ్ల చెట్లు లేకపోవడంతో భక్తులు ఇచ్చే ఆహారంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఎండకాలంలో.. ఆహారం కోసం మరింత ఇబ్బంది పడుతున్నాయి.అయితే, కొంత మంది భక్తులు.. ఇక్కడికి వచ్చి వివిధ రకాల పండ్లు ఇక్కడికి వచ్చి కోతులకు పెడుతున్నారు. కానీ.. అ ఏమాత్రం సరిపోవడం లేదు. సహజంగానే హనుమాన్ ఆలయాల వద్ద ఎక్కువగా కోతులు ఉంటాయి. వాటికి కడుపు నింపేందుకు అధికారులు ఎలాంటి ఆలోచన చేయడం లేదని భక్తులు మండిపడుతున్నారు. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి.. కోతుల జోన్ ఏర్పాటు చేసి వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి రోజూ ఇక్కడ కోతులు రంగం చేస్తున్నాయి. ఒక్కసారి కోతి పైకి వస్తే.. చేతిలో ఏం ఉన్న వదిలిపెట్టి వెళ్తారు. గతంలో చేతిలో ఉన్న బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వాటిని మళ్లీ కోతుల నుంచీ తీసుకోవడానికి భక్తులు నానా తంటాలు పడాల్సి వస్తుంది.అయితే.. మంకీ ఫుడ్ కోర్టును అభివృద్ధి చేసి, భారీగా పండ్ల మొక్కలు పెంచితే తప్ప కొంత మేరకు భక్తులకు బాధలు తప్పేలా లేవు. లేదంటే.. భయం.. భయంగానే భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036